# తోరణం

కె. సురేష్ కుమార్

ప్రశాంతంగా వున్నగదిలో అశాంతి నిండిన హృదయంతో వున్నాడు శ్రీనివాస్. అతని అశాంతికి అసలు కారణం మరొకటయినా అతను డాక్టర్ కావటంకూడా ఆ క్షణంలో ఓ కారణమే- అలాగని అతనికి ఆ వృత్తిమీద ఇష్టంలేదని కాదు. అందుకు వేరే కారణం వుంది. కారణాల తోరణాలకన్నా ముఖ్యమైంది సత్యం. నిద్రలోవచ్చే కలల్లా కాక మనసు కనే కలలు సాధారణంగా మధురంగా ఉంటాయి. అందుకే స్వప్నం తలకిందులయిందనే సత్యం చేదుగా, బాధగా వుంటుంది. మానసిక పరిపూర్ణత సాధించుకోని ప్రతిమనిషి అనుభవించేదీ అదే.

శ్రీనివాస్ హృదయంలో అతని భార్యకాక అరుణ కదులుతూంది. అరుణ అతని యౌవనంలోని తొలిచెలి. అతని యెడద జాబిలి. అతను మతిమాలి వలచిన కోమలి. ఎం.బి.లో చేరిన మొదటి సంవత్సరంలో అతనికి అరుణతో పరిచయం కలిగింది. అతని బ్రతుకులో వలపుల అరుణోదయమైంది. కాని ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలుసుకునేలోగానే తొలిసంధ్య అనుకొన్నది మలిసంధ్యలాగా మారి కాస్సేపటికి లో చీకటి మిగిల్చింది.ఫస్టియర్ చివరలో అనుకోకుండా తనతండ్రి టెలిగ్రాం చూసుకొని ఇంటికి వెళ్ళిన శ్రీనివాస్, వెకేషన్స్ అయిపోయి మళ్ళీ వచ్చేసరికి, యేం జరిగిందో, యెలా జరిగిందో అరుణజాడ తెలియరాలేదు. ఆ తరువాత చాలాకాలం పిచ్చివాడుగా తిరిగాడు. కాలం గారడిలో విధి ఆరడిని మరచిపోగలిగాడు.

ఎం. బీ. పూర్తయింది. డాక్టరుగా ప్రయివేట్ ప్రాక్టీసు పెట్టుకున్నాడు. ఏడాది తిరిగే లోగానే మంచి సంబంధం వచ్చింది. పెళ్ళి అనేది తప్పదుగనుక తప్పించుకోలేకపోయాడు.

పెళ్ళితంతు మొదలయిన క్షణంనుండీ అతనికి నీలిమ స్పర్శలో ఒకవింత గోచరిస్తూనే వుంది. ఐతే చేయిచేయి పట్టుకుని జీవితపథంలో జంటగాసాగే నవదంపతుల తొలిసోపానం—సాప్తపది వేళలో మాత్రం నీలిమస్పర్శలో తోచిన వింతను, హృదయస్పందనకు లయబద్ధమయిన నాడిచప్పుళ్ళే విస్పష్టం చేశాయి. నీలిమ గర్భవతి. అది తెలిసీ, నిర్ధారించుకోలేదు కనుకా, సంస్కారం అడ్డువచ్చి ఏమీ చేయకూడదని ఊరుకున్నాడు. కానీ ఆ శోభనపురాత్రి అతని హృదయంలో వైముఖ్యాన్ని రేకెత్తిస్తూంది. సిగరెట్ పీలుస్తూ అలాగే ఆలోచిస్తూన్న శ్రీనివాస్, తలుపు చప్పుడు కావటంతో తలెత్తిచూశాడు.

ముత్తయిదువలు ముద్దుగా నీలిమను గదిలోకి పంపి తలుపుమూశారు. అక్కడే ఆగిపోయింది నీలిమ.

ఒకసారి పరీక్షగా ఆ అలంకరణంతా కాదని ఆమె నిలుచున్న తీరును, హృదయ ప్రతిబింబాలుచూపే కళ్ళు, ముగ్ధత్వం నిండిన

★ ఒక్కోసారి నిజం నిప్పులా మారుతుంది. వివేకంగలవాళ్ళ ఆలోచనలను దహించి అయోమయంలోకి తోసేసి కలత పెడుతుంది. ఆవేశపెడుతుంది. ఆవేశం మనిషి వివేకాన్నే దెబ్బతీస్తుంది మరి! ★

ముఖాన్ని చూశాడు. సిగ్గుకంటే సంకోచమే కనిపిస్తూందతనికి. బిడియంకంటే భయమే గోచరిస్తుందా కళ్ళలో. ఆమెచేసింది పొరపాటన్న ఆలోచన తొలగిపోకున్నా, కనీసం నటించలేని ఆ హృదయనైర్మల్యం అతన్ని ఒక్కక్షణం కదిలించింది.

"రా నీలిమా" అన్నాడు మృదువుగా.

సిగ్గుపడుతూనే అతని ఎదుటి కొచ్చింది నీలిమ. శ్రీనివాస్ కూచోమన్న మీదట అతని క్కాస్త ఎడంగా కూచుంది.

కాస్సేపు మౌనం రాజ్యమేలింది. అంత సేపూ ఆలోచిస్తున్న శ్రీనివాస్ చటుక్కున అన్నాడు——

"చూడు నీలిమా. ఇది తొలిరేయి, అంటే యింతదాకా కొత్తవాళ్ళమయిన మనం ఇకపైన జీవితాంతం పంచుకునే అనుభవాలకు తొలిసోపానం యీ రోజన్నమాట" ఆగి నీలిమ వైపు చూశాడు.

ప్రశాంతంగా, శ్రద్ధగా వింటూంది. మళ్ళీ అన్నాడు శ్రీనివాస్——

"గతం భవిష్యత్తుకు పునాది అన్నారు. కనక మన జీవనగతాలు మనం వాటికి విలువనిచ్చినా యీయకపోయినా తెలియ చెప్పుకోవటం మంచిదని నా అభిప్రాయం."

"అవును" అంది నీలిమ వినిపించీ వినిపించనంత మెల్లగా.

ఆమె అలా మాటాడటం కాస్త ఆశ్చర్యం వేసింది.

ఐతే, ఎలాగోలా ఆ విషయం శ్రీనివాస్‌కు చెప్పేయాలనే నిశ్చయించుకున్న నీలిమకు ఎందుకోసం అతనామాటలన్నాడో తెలియకపోయినా, అతని సంభాషణ ప్రోత్సాహాన్ని కలిగించింది.

"కానీ, నిజం నిదానంగా అర్థం చేసుకోగలిగితే నేను అదృష్టవంతురాలినవుతాను."

ఆ మాటకు మరింత ఆశ్చర్యపోయాడు శ్రీనివాస్. ఐతే తాను గర్భవతిననే విషయం నీలిమ చెప్పేస్తుందా? అతను వేగంగా ఆలోచిస్తున్నాడు. తనుచేసిన పొరపాటు భర్తముందు దాచి అతన్ని నటనతో మోసం చేయడంకంటె నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే నీలిమను తను ఆదరించగలడా? ఆలోచిస్తూనే,

"చెప్పు వింటాను" అన్నాడు.

నీలిమ చెప్పటం ఆరంభించింది.

"టు ఎర్ యీస్ హ్యూమన్ అని మీకు తెలుసనుకుంటాను, నేనూ అందరిలాంటి ఒక మామూలు మనిషిని. మా కాలేజీ మేట్‌ను పెళ్లి చేసుకోవాలనుకున్నాను. అతన్ని విశ్వసించాను. తేనె తీసుకొని తేటి ఎగిరిపోయాక పువ్వు చేయగలిగిందేమీ వుండదు. నా జీవితమూ అలాగే అయింది. అమ్మానాన్నా గొడవచేశారు. ఈపెళ్లి నిశ్చయంచేశారు. నేను నిజం చెప్పమని ఎంత ఒత్తిడి చేసినా వినలేదు. నా యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా పెళ్లి జరిగిపోయింది."

అంతసూటిగా చెబుతున్న నీలిమ నిర్భయత్వాన్ని అభినందించకుండా వుండలేకపోయింది శ్రీనివాస్ హృదయం.

"కానీ పొరపాటును ధైర్యంగా ఒప్పుకోవటం, శిక్షను నిర్భయంగా భరించటం నా అభిమతం. నేను మాత్రం ఇది దాచి మిమ్మల్ని మోసం చేయలేను. నిజం మీకు చెప్పాను. నా హృదయం నిర్మలమైంది. అది ఇకపైన కేవలం మీది. ఇక ఏం చేయాలని మీరు నిర్ణయించినా నేను ఎదురుచెప్పను." చీరకొంగు చివర వేళ్ళకొసలతో మెలివేస్తూ తలదించుకొని కూర్చుంది నీలిమ.

శ్రీనివాస్ ఏమీ మాటాడలేదు. అంతదాకా వూరికే కాలుతూన్న సిగరెట్ పడేసి మరోటి వెలిగించుకున్నాడు.

జరిగిన పొరపాటులో నీలిమ పొరపాటు ఎంతవరకున్నదనేది తాను నిర్ణయించలేడు. ఐతే అతని ఆలోచనలు మరోవిధంగా వున్నాయి.

తనూ నీలిమలాగే మరొకరిని ప్రేమించాడు. పెళ్లిచేసుకోలేక పోయాడు. ఐనా, నీలిమలాగా సంఘం హర్షించలేని పొరపాటు తను చేయలేదు. ప్రేమ అన్నది ఎంత ఆకర్ష

ణీయమయినదయినా శారిరక వాంఛలకు తన మనస్సును లొంగనీయలేదు.

భార్యా భర్తలనే బంధంలో తన దృష్టిలో వాళ్ళను కలుపగలిగిన తీయని అనుభవాలలో తొలిరేయికూడా ఒకటి. అది ఇద్దరికీ నవ్యాను భవమైతేనే అవ్యాజానుబంధం యేర్పడుతుం దేమో. ఐతే తన విషయంలో వేరుగా జరి గింది, ఇది తనకు మాత్రమే తొలిరేయి. తన జీవిత భాగస్వామికి, తను పెళ్ళాడి అర్ధాంగి అనుకున్న వ్యక్తికి మాత్రంకాదు.



కన్నెపిల్లలోని ఆ తొలిసిగ్గు, తొలి సారిగా రుచిమాచే ఆ అనుభవాలలోని వింతయిన మత్తు అవన్నీ చవిచూసే అదృష్టంనీలిమనుండి తనకు కలుగదు. అలాంటి ఆలోచన రాగానే శ్రీనివాస్ మనసంతా కల్లోల భరితమయింది.

శృంగారం అనేది ప్రకృతిలోని అద్భుత మయిన అనుభవం. తనను తాను వ్యాప్తి చేసు కొని, సదా నిలచిపోవటానికి యీ ప్రకృతి పతి ప్రాణిలోనూ ఏర్పరచే అద్వితీయానుభూతి అది. సహజంగానే అందులోని పూర్తి ఆనం దాన్ని అనుభవించాలని శ్రీనివాస్ అను కున్నాడు. అలాటి అవకాశం లేదని తెలిసి, మనసును సమాధాన పరచుకోవటం సామాన్య మైన విషయమేమీ కాదు.

అలాగని నీలిమను తిరస్కరించటానికీ శ్రీనివాస్ మనసు ఒప్పుకోవటంలేదు. అమా యకంగా ఒక మగవాణ్ని నమ్మటమే నీలిమ చేసిన పొరపాటయితే, దాన్ని క్షమించి ఆద రించగల మరొకమగవాడి సంకుచితత్వము కారణంగా ఆమె జీవితం బలికావట మనేంతటి ఘోరశిక్ష అనుభవిం చాలా? అలా కాకుండా చేయగల అవకాశం తనకుంది. కానీ మన స్ఫూర్తిగానే చేయలేకపోతున్నాడు.

అలా చాలాసేపు ఆలోచించిన మీదట ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా అన్నాడు—

"నీలిమా, నిజానికి నేను విలువ నిస్తాను; ఐనా కొన్ని నిజాలు భరించటం కష్టం. తప్ప కుండా ఈ నిజం భరించగలిగే మంచితనం

పొందగలను. కానీ అందాకా దయచేసి నన్ను క్షమించి దాంతోపాటు. ఈ నిజం కూడా మన మధ్యనే వుండనీయి" అనేసి లేచివెళ్ళిపోయాడు.

* * *

చాలాసేపు ఒంటరిగా కూర్చుని, ఈ ఆలోచనలతో పిచ్చెక్కిపోయింది శ్రీనివాస్‌కు. బట్టలు మార్చుకుని- పర్స్ జేబులో పెట్టుకుని బయటకు నడిచాడు. నీలిమ అతన్ని వారించలేదు. ఆ రోజంతా హడావిడి మూలంగా అంతా అలసిపోయి నిద్రలో వున్నారు. శ్రీనివాస్ వెళ్ళటం ఎవరూ గమనించలేదు.

అణచుకోలేని మనసును మరచిపోటానికే ప్రయత్నిస్తాడు, నిబ్బరంలేని ప్రతి మనిషి. బలహీన మనస్కులందరూ అందుకు ఎన్నుకొనేది మత్తు ఒక్కటే. శ్రీనివాస్ కాళ్ళూ బార్ వైపే దారితీశాయి.

అరుణ తనను అర్థం చేసుకోలేదు. అవాంఛితంగా జరిగిన పొరపాటు అనూహ్యమైన బలికోరింది. ప్రతివాడూ తన జీవిత భాగస్వామి పవిత్రంగా వుండాలనే కోరుకుంటాడు. కానీ ఆ పవిత్రతగానీ, శీలంగానీ మనసుకు సంబంధించినదనీ, శారీరకమైనది ఎంతమాత్రమూ కాదనీ చాలామంది గ్రహించలేరు. నేనూ అలాంటివాణ్నే అనుకొని అరుణ ఆత్మహత్య చేసుకుంది. చివరి చూపులకు కూడా నోచుకోలేని అభాగ్యుడై పోయాడు తను. అరుణ శవంకూడా దొరకలేదు. మెరుపులా మెరిసి తనపై పిడుగు వేసింది అరుణ. అరుణ అలా చేయకపోతే తను యిప్పుడు నీలిమను గురించిలా ఎంతమాత్రమూ ఆలోచించేవాడు కాదు.

అలా ఆలోచిస్తూనే బార్‌దాకా వెళ్ళాడు.

అలవాటు లేనివాడు కనుక కొద్దిగా తాగేసరికే నిషా ఎక్కింది. బాటిల్ పూర్తిచేసి బిల్లు జేబులోంచి తీసిపడేశాడు. బిల్లు ఎంతయిందో తను ఎంత యిచ్చాడో తెలుసుకొనే స్థితిలో లేడు, మెల్లగా కాళ్ళు బైటికి దారితీశాయి. ఇద్దరు ముగ్గురు రిక్షావాళ్లు ఎక్కడికో తీసుకెళ్తామన్నారు. రిక్షా ఎక్కి కూర్చున్నాడు. దిగినాక ఓ యింట్లోకి తీసుకెళ్ళి ఏదో చెప్పాడు రిక్షావాడు. శ్రీనివాస్ రిక్షావాడికి డబ్బులు కూడా యివ్వలేదు.

కళ్ళు విప్పుకుని చూశాడు. ఏవో కిలకిలలు కలకలం వినిపిస్తూందే తప్ప ఏదీ స్పష్టంగా కనిపించటంలేదు.

ఇంతలో ఓ అమ్మాయి వచ్చి శ్రీనివాస్ ముఖం రెండు చేతుల్లోకి తీసుకుని కళ్ళల్లో కళ్లుపెట్టి చూసింది.

"ఏయ్" అంటూ ఆమె చేతులు తోసేశాడు.

ఆ అమ్మాయి మరో ఆవిడతో మెల్లిగా ఏదో చెప్పి, అతన్ని నడిపించుకొని ఓ గదిలోకి తీసుకెళ్లింది. శ్రీనివాస్‌ని మంచంమీద కూర్చోబెట్టింది, ఒక గ్లాసుడు చల్లటినీళ్ళు తాగించింది బలవంతంగా. శ్రీనివాస్‌కి కొంచెం నిషాదిగింది. కానీ ఒళ్ళు స్వాధీనంలోలేదు.

"ఏయ్, ఎవరునువ్వు?"

"ఈరోజుకయినా మీదాన్ని."

"అంటే నా భార్యవా?"

"ఈరోజుకు మాత్రం."

"మరి రేపు?"

"నిన్నటి దాకాలాగే రేపుకూడా మీరెక్కడో నే నెవ్వరో మీకు."

"అంటే?"

"అదిపోనీ, మీరెప్పుడయినా ఇంతక్రితం ఇలాంటి చోటుకి వచ్చారా?"

"ఇలాంటి అంటే ఎలాంటి చోటు?"


"ఒక రేయి సుఖంగా గడపగలిగిన చోటు."

"ఉహుం నాకు యివ్వాళే తొలిరేయి, ఇవ్వాళే మొదటిసారి."

ఆ చోట అలాంటి జంట అదొక్కటే నేమో, ఏదో పొందగల చోట, కనీసం అదేమిటో తెలుసుకోలేని స్థితిలో వున్న మగవాడు అది తెలిసీ స్వార్థంకొద్దీ కాక, ఏదో మంచితనం కొద్దీ అతని మనసు లోతుల్లోకి చొచ్చుకొని పోతున్న ఆడది, బహుశా అలాంటి చోట వాళ్ళిద్దరేనేమో.

* * *

నిద్రనుండి లేచేసరికి పదిన్నరయింది. శ్రీనివాస్ పక్కనే కూచుని వుంది నీలిమ.



రాత్రంతా ఏడ్చినట్టుగా ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి నీలిమ కళ్ళు. ఆ పెదాలమీద తెచ్చి పెట్టుకొన్న నవ్వు. అయినా ఆ ముఖంలో నిర్మలత్వం.

తాను రాత్రి మత్తులో ఏం చేసిందీ స్పష్టంగా గుర్తు లేకున్నా నీలిమను నొప్పించాడని గ్రహించాడు శ్రీనివాస్.

"నీలిమా, నేను దుర్మార్గుడ్ననుకొంటున్నావు కదూ?" నోటిదాకా వచ్చిన మాట అనటానికి ఏదో మొహమాటం అడ్డు వచ్చింది శ్రీనివాస్‌కి. లేచి తల వంచుకొని వెళ్ళిపోయాడు.

అది మరోలా భావించిన నీలిమ నిశ్శబ్దంగా నీళ్ళు దిగమింగుకుంది.

ఇంట్లో ఎవరికీ ఏమి అనుమానం రాకుండా రాత్రంతా మేలుకుని వున్న నీలిమ, తెల్లవారుతూండగా వచ్చిన శ్రీనివాస్‌ను, తీసుకెళ్ళి గదిలో పడుకోబెట్టింది.

స్నానాదులు కానిచ్చి టిఫిన్ పూర్తి చేసిన శ్రీనివాస్‌కు పోస్టులో వచ్చిన ఓ కవర్ తెచ్చి యిచ్చింది నీలిమ.

విప్పి తెరిచాడు.

"వాసూ" సంబోధన చూడగానే ఆశ్చర్యపోయాడు. హృదయ వీణలో ఏదో మూగపోయిన తీగను ఎవరో మీటినట్టు, ఎక్కడివో మాసిపోయిన తలపులు మెరిసినట్టు ఎక్కడివో గత జన్మలోని వాటిలాంటి జ్ఞాపకాలు స్మృతి పథంలో మెదిలాయి.

తనను అలా సంబోధించేది అరుణ ఒక్కతే.

చివరి పేజీ తీసి సంతకం చూశాడు. "అరుణ" అని చూడగానే గుండె వేగంగా కొట్టుకోసాగింది. గబగబా చదువసాగాడు.

"ఏ జన్మలో చేసిన పుణ్యమో, ఒక్కసారి మళ్ళీ నిన్ను చూడాలనుకున్న నా కోరిక తీరింది. అంతమాత్రాన నేను అదృష్టవంతురాలినని, నీదాన్ని కాకపోయిన తరువాత కూడా ఎలా అనుకోగలను?

ఎవడో నీచుడి కామానికి బలయిన నేను, అభిమానం చంపుకోలేక ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. కనీసం ఆ అవకాశం కూడా లేకుండా సిగ్గు, లజ్జలేని ఒళ్ళమ్ముకునే వాళ్ళలో కలిసిపోయాను. విధికి నామీద ఎందుకంత పగో ఏమని చెప్పను?

జీవచ్ఛవంలా బ్రతుకుతున్నా నాలో నిన్ను. ఆ వ్యభిచార కొం... ఎలాం...

నా మూలంగా నువ్వు తాగుబోతువు, వ్యభిచారివీ ఐనావేమో ననుకున్నాను. కానీ కాదని తెలుసుకోగలిగాను.

వాసూ, ఒక ఆడదానికోసం నాశనం చేసుకోవలసినంత అల్పమైంది కాదు జీవితం. నువు డాక్టరువి. నీద్వారా సంఘానికి యెంతో కొంత మేలు జరుగుతున్నదంటే, దాన్నంతం చేసే హక్కు నీకులేదు.

నీ భార్యగురించి నువు చెప్పినది విన్నాక నీకు ఒక్కమాట చెప్పాలనిపించింది. అరుణ దురదృష్టవంతురాలయితే నీలిమ అమాయకురాలు. ఆమె తను చేసిన తప్పు తెలుసుకొని తానుగా ఒప్పుకొని, నిన్ను తన దేవుడిగా భావించనెంచింది. అలాంటి నిర్మల హృదయిని నీభార్యగా దొరికితే జరిగిన చిన్న పొరపాటుకు ఆమె జీవితం నాశనం చేయటం న్యాయంకాదు.

నేనే, ఆనాడు నీదగ్గిరకొచ్చివుంటే నువు ఇలాగే ప్రవర్తించేవాడివా? ఎంత మాత్రమూ కాదు. నాకా అదృష్టంలేదు. ఐనా కాకతాళీయంగా నిన్ననే నువు నాదగ్గరకి రావటము మంచిదే అయింది.

వాసూ, నీ తొలిరేయి అనుభవం నీభార్యతోనే పంచుకో. ఆమె పొరపాటు చేసింది. నేను నీచాతినీచమైన స్థానంలోవున్నాను. మనసును జోకొట్టి మత్తులోవున్న నీ ఆశలను నీదాన్ని కావాలనుకున్న నా ఆశకు బలిచేయదలచుకోలేదు. అందుకే నీకు నన్ను అర్పించుకోలేకపోయాను.

నాకోసం ఎంతమాత్రమూ ప్రయత్నించవద్దు. అరుణ చచ్చిపోయిందనుకో. నీలిమను ఆదరించు.

ఒకచిన్న కోరిక తీరలేనంత మాత్రాన, ఒక బ్రతుకు నాశనం చేయటం మంచిది కాదని మాత్రమే నేను చెప్పేది.

నామాట కాదనవనే ఆశతో,

—అరుణ."

ఉత్తరం పూర్తిచేసి, భారంగా కళ్ళు మూసుకున్న శ్రీనివాస్, "తలనొప్పిగావుందా" అన్న నీలిమ మాటకు, నుదిటిమీద ఆమె స్పర్శకు మెల్లిగా కళ్ళువిప్పాడు.

లేచి, నీలిమను గట్టిగా కౌగిలించుకున్నాడు, పసిపిల్లవాడిలా.

అతని కళ్ళలోనుండి కారుతున్న వెచ్చటి కన్నీళ్ళు భుజంమీద పడుతూండగా యేమీ అర్థంకాకపోయినా, తల్లి లాలించినట్టుగా అతని వీపుమీద చేయివేసి నిమురుతూ వుండిపోయింది నీలిమ. □


## జ్యోతి నవలల పోటీకి

### నవలలు పంపేందుకు చివరి తేదీ

### 20, సెప్టెంబర్, 1978

పూర్తి వివరాలు ఈ సంచికలోనే మరోచోట ఉన్నాయి.